క్లుప్తంగా

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయ కొండ గంగమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

వైభవంగా తిరుపతి గంగమ్మ జాతర



తిరుపతి గంగమ్మను ఊరేగిస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని దేవదొడ్డిలో శనివారం రాత్రి వైభవంగా తిరుపతి గంగమ్మ జాతరను నిర్వహించారు. గ్రామ పొలిమేర్లలో అమ్మ వారి శిరస్సుకు ప్రత్యేక పూజల అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు మొక్కులు చెల్లించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో పటాలమ్మకు పూజలు



పూజలందుకున్న పటాలమ్మ

పుంగనూరు: పట్టణం సమీపంలో రామసముద్రం రోడ్డులోని పటాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. కౌన్సిలర్ పూల త్యాగరాజు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ రాజ్‌గోపాల్

రామకుప్పం: నవసమాజ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 60 మంది విద్యార్థులకు బందార్లపల్లె సర్పంచ్ రాజ్‌గోపాల్ చేతుల మీదుగా పరీక్ష సామగ్రి అందజేసారు. రాజ్‌గోపాల్ మాట్లాడుతూ, దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర, ఎన్ఎస్ఎఫ్ సంస్థ వ్యవస్థాపకుడు నగేష్, పీఈటీ రమణారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన తేదీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



తమ డిమాండ్లను చూపుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

పలమనేరు: ఫ్యామిలీ పెన్షనర్ల పుట్టిన తేదీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు కోరారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు ఏడు శాతం అదనపు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ గౌస్, వీరభద్రరావు, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం

పూతలపట్టు: సమాజంలో ఆదరణ లేక కనుమరుగవుతున్న జానపద కళలను కాపాడుకుందామని జిల్లా జానపద సంఘం అధ్యక్షులు కె.యస్.రామచంద్రన్ తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి, పూతలపట్టు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల మండలాల జానపద కళాకారులను ఆయన ఆదివారం కలిశారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కళల ప్రదర్శనకు హాజరు కావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ వీధినాటకం, వీధి భాగవతం, హరికథ, బుర్రకథ వంటివి కనుమరుగైపోతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న కళలనైనా కాపాడి భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాకారమవుతున్న సొంతింటి కల



కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

సదుం: రాష్ట్ర వ్యాప్తంగా పేదల కోసం లక్షలాది గృహాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. పల్లెలు, పట్టణాల్లో జగనన్న కాలనీల నిర్మాణం వేగవంతంగా సాగుతోంది. పేదలందరికీ ఇళ్ల పథకం కింద గృహాలను త్వరితగతిన నిర్మించేలా చర్యలు తీసుకుంది. గ్రామ సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి అవసరమైన వారికి ఇప్పటికే స్థలాలను పంపిణీ చేశారు. ఆ స్థలాల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. మండలంలోని ఎర్రాతివారిపల్లె మార్గంలోని కాలనీలో 124 గృహాలు, బూరగమంద పంచాయతీ రామాపురం వద్ద జగనన్న కాలనీలో 34 గృహాలు నిర్మిస్తున్నారు.

మండలానికి మంజూరైన గృహాలు :	1414
నిర్మాణాలు పూర్తి చేసుకున్నవి :	967
నిర్మాణంలో ఉన్న గృహాలు :	447
ఖర్చు చేసిన మొత్తం :	రూ.18.25 కోట్లు

అధికారుల పర్యవేక్షణ

జగనన్న కాలనీలతో పాటు, తమ సొంత స్థలాల్లో ఇళ్లు మంజూరైన వారు సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే కాలనీలో సీసీ రోడ్లు వేశారు. ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకున్నారు. పనుల పురోగతిని ఎప్పటిప్పుడు పర్యవేక్షిస్తూ సలహాలు–సూచనలు ఇస్తున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు

జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తోంది. మరో రూ. 35 వేలను పొదుపు ద్వారా బ్యాంక్ నుంచి రుణ సదుపాయం కల్పిస్తోంది. అంతేకాకుండా తక్కువ ధరకే సిమెంటు, ఎలక్ట్రిక్ సామగ్రిని లబ్ధిదారులకు అందజేస్తోంది.

"

సొంతింటి కల నెరవేరుతోంది

సొంతిల్లు లేక కొన్నేళ్లుగా బాడుగ ఇంట్లో ఉంటున్నాం. సొంత ఇల్లు కట్టుకోవాలన్న మా కల సీఎం జగనన్న అధికారంలోకి వచ్చాక తీరింది. ప్రస్తుతం మా ఇంటి నిర్మాణం పూర్తయ్యింది. త్వరలోనే గృహప్రవేశం చేస్తాం. ఇది మాకెంతో ఆనందాన్నిస్తోంది.



– లక్ష్మి, భట్టువారిపల్లె, సదుం

ఇంటి పని పూర్తయ్యింది

జగనన్న కాలనీలో మాకు ఇళ్ల స్థలం కూడా ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. అందరి సహకారంతో ఇంటి నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. సొంతింటి కల తీరదనుకున్న మాకు ప్రస్తుత ప్రభుత్వం అండగా నిలిచి, కల నెరవేరేలా చేసింది.



– ఫర్జానాబీ, సదుం

నేడు, రేపు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

కుప్పం రూరల్: రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం మున్సిపాలిటీలో పల్లెబాటలో భాగంగా రెండు రోజులు పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు 9వ వార్డు, 10 గంటలకు 10, 11 వార్డులు, 11 గంటలకు 12, 13 వార్డులు, 12 గంటలకు14, 15 వార్డులు, మధ్యాహ్నం ఒంటి గంటకు 7, 8 వార్డులు, 2 గంటలకు 16, 17, 20 వార్డుల్లో పర్యటించనున్నారు. 3 గంటలకు 18, 19, 21 వార్డులు, 4 గంటలకు 22, 23, 24వ వార్డుల్లో మంత్రి పాల్గొని ప్రసంగించనున్నారు. ఇక, మంగళవారం ఉదయం 9 గంటలకు 1, 2వార్డులు, 10 గంటలకు 3, 25 వార్డులు, 11 గంటలకు 4వ వార్డు, మధ్యాహ్నం 12 గంటలకు 5వ వార్డు, ఒంటి గంటకు 6వ వార్డులో పర్యటిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కుప్పం బస్టాండు ఆవరణలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పల్లెబాట ఏర్పాట్ల పరిశీలన



మఠంలో ఏర్పాట్లపై నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండలంలో బుధ, గురు వారాల్లో పర్యటించనున్న ప్రాంతాలను ఎమ్మెల్సీ భరత్ పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణితో కలిసి పరిశీలించారు. ఆదివారం ఆయన ఎంకె.పురం, మఠం, కొలమడుగు, శివరామపురం, కడపల్లె, మొరసనపల్లె, అబకలదొడ్డి, నడింపల్లెలో సభల నిర్వహణకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేశారు. స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులతో మాట్లాడారు. సభలకు హాజరయ్యే ప్రజలు, పార్టీ శ్రేణులకు ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బలిజలంతా సంఘటితమవుదాం





సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు ఆంజనేయులు, హాజరైన బలిజ కులస్తులు

వి.కోట: బలిజ కులస్తులంతా సంఘటితమవ్వాలని బలిజ సంఘ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని పాట్టుభాస్కర లేఔట్‌లో మండల బలిజ కులస్తుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బలిజ కులస్తులు ఐకమత్యంతో ఉంటే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి అవకాశాలుంటాయన్నారు. రాజకీయాలు, ప్రాంతీయ బేధాలు లేకుండా ఏర్పాటయ్యే బలిజ సంఘంలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా ఉండాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా జీఎం సుబ్రమణ్యం, అధ్యక్షుడిగా ఆంజనేయులు, కోశాధికారిగా ముకుంద, ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షుడిదా భాస్కర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీ సద్గురు యోగినారాయణ బలిజ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, మండలంలోని బలిజ కులస్తులు హాజరయ్యారు.

జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు



ఇళ్ల గృహ ప్రవేశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ రామచంద్రాపురం కాలనీ పక్కన నిర్మించిన జగనన్న కాలనీలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వం పార్టీలకతీతంగా పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటా వెంకటరమణ, విజయశేఖర్, కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, సైపుల్లాఖాన్, హౌసింగ్ ఏఈ యోగానంద్, కార్యదర్శి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను విమర్శించే అర్హత బాబుకు లేదు

రొంపిచెర్ల: వలంటీర్లను విమర్శించే అర్హత మాజీ సీఎం చంద్రబాబుకు లేదని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. అయన ఆదివారం రొంపిచెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్హుల ముంగిటకే సంక్షేమ ఫలాలను వలంటీర్లు అందిస్తుంటే చంద్రబాబు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలతో కేవలం టీడీపీ కార్యకర్తలకే పథకాలను అందించారని, ప్రస్తుతం వలంటీర్లు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నారనేది గుర్తెరగాలని హితవు పలికారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తూండటం చూసి ఓర్వలేక తొలుత పవన్ కళ్యాణ్‌తో వివాదాస్పద వ్యాఖ్యలు చేయించి వలంటీర్ల ఆగ్రహాన్ని చవిచూశారని, అయినా తీరు మారక చంద్రబాబు కూడా వలంటీర్లను విమర్శించడం శోచనీయమన్నారు. వీరిద్దరి తీరుపై ప్రజలు కూడా మండిపడుతున్నారని, వారికి మరోసారి బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. సమావేశంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయశేఖర్, కరీముల్లా, చిన్న నాగరాజ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా ముగ్గురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను తరలిస్తున్న 108 అంబులెన్సు

పెద్దపంజాణి: ట్రాక్టర్ బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కొళత్తూరు చెరువు కట్టపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. పలమనేరు మండలం టి.ఒడ్డూరుకు చెందిన సిద్ధప్ప కుమారుడు అంజి కుటుంబ సభ్యులు, పీలేరుకు చెందిన హరిబాబు మామిడి కాయల కోతలకు కొళత్తూరు నుంచి పెద్దపంజాణికి ట్రాక్టర్‌లో వెళుతూ కొళత్తూరు చెరువు కట్టపై ప్రమాదానికి గురయ్యారు. ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులోకి బోల్తా పడింది. దీంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలకు వ్యాపకంగా పుస్తక పఠనం



మాట్లాడుతున్న ఆముదాల మురళి

పలమనేరు: పిల్లలకు పుస్తక పఠనం ఒక వ్యాపకంగా అలవాటు చేయాలని శతావధాని ఆముదాల మురళి అన్నారు. స్థానిక కళా మందిరంలో ఆదివారం పుస్తకాలతో కాసేపు అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పిల్లలు పుస్తకాలను చదివేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఓ మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానమన్నారు. కార్యక్రమంలో తులసీనాథం నాయుడు, పుష్ప, నరేంద్ర, శివశంకర్‌రెడ్డి, సీతారామయ్య పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో శాంతి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రతినిధులు



పలమనేరు : జగమర్లలో..

కుప్పం రూరల్: భగవద్గీత పఠనంతోనే విశ్వశాంతి సాధ్యమని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని చందం, చందం కాలనీ గ్రామాలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ప్రబోధానంద రచించిన తెలుగు సంస్కృతి, సాంప్రదాయ పుస్తకాలను ప్రజలకు పరిచయం చేశారు. కృష్ణ మాట్లాడుతూ, కులమతాలకతీతంగా భగవద్గీత పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రకాశ్, కృష్ణారెడ్డి, సుధాకర్, శరవణ, వెంకటేష్, చరణ్, కృష్ణ, ఇందిర, రాధా, తిమ్మక్క, వెంకటలక్ష్మి, యశస్విని పాల్గొన్నారు.

జగమర్లలో..

పలమనేరు: శ్రీకృష్ణుడే జగత్ గురువని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకులు భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని జగమర్లలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. భగవద్గీత పుస్తకాలను ప్రజలకు ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో రాజేంద్ర, హేమంత్, రెడ్డి జ్ఞానజ్యోతి, వాణిశ్రీ పాల్గొన్నారు.

టెట్రా ప్యాకెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని మండిపేట వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 96 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేయడంతోపాటు మండలంలోని సాంబార్‌పూర్‌కు చెందిన మునెప్ప(62) నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు డీటీఎఫ్ చిత్తూరు టీమ్ సీఐ మాధవస్వామి ఆదివారం తెలిపారు. దాడుల్లో వీరు పట్టుబడినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వలి, సిబ్బంది దశరథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు సహా కర్ణాటక మద్యం..

రామకుప్పం: కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని విజలాపురం మలుపు వద్ద సెబ్ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. భూమండలపురానికి చెందిన బాలచంద్ర ఓమ్నీ కారులో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 384 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

సుంకోజికి జయమ్మ పురస్కారం



సుంకోజి దేవేంద్రాచారి

పలమనేరు: జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత సుంకోజి దేవేంద్రాచారికి కేఎస్ జయమ్మ స్మార్తి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు స్థానిక కవి పలమనేరు బాలాజి ఆదివారం తెలిపారు. సాహితీ రంగంలో విశేష కృషి చేస్తున్న వారికి ఏటా ఇచ్చే పురస్కారాల్లో భాగంగా ఈ అవార్డును ఆయనకు స్థానిక కళామందిరంలో ఆగస్టు 6న ప్రదానం చేస్తామన్నారు. జ్ఞాపికతోపా టు అవార్డు కింద ఆయనకు రూ.25వేల నగదు బహుమతిని ఇవ్వనున్నట్టు చెప్పారు. బహుజనుల జీవితాలను, దుఃఖాన్ని, పోరాటాలను ఇతివృత్తంగా తీసుకుని ఆయన రచనలు ఉంటాయని పేర్కొన్నారు.

7న ఓబీసీ జాతీయ మహాసభ



మాట్లాడుతున్న మధు ఆచారి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఆగస్టు 7వ తేదీన ఓబీసీ జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జయచంద్ర, ఉపాధ్యక్షుడు మార్గాని మధు ఆచారి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అధ్యక్షన నిర్వహించనున్న ఈ మహా సభకు దేశ వ్యాప్తంగా నలుగురు ముఖ్యమంత్రులు హాజరవుతారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదంతో పాటు ఓబీసీల ప్రధాన సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నాగేంద్ర, సుబ్రమణ్యం, జగదీష్, వాసు పాల్గొన్నారు.

తరాలు చూసిన స్నేహ బంధం



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



క్లిక్..క్లిక్ : కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సదుం: వారంతా ఆరుపదుల వయస్సు దాటిన వారే! దాదాపు ఐదు దశాబ్దాల క్రితం స్థానిక జెడ్పీ హైస్కూలులో పదవ తరగతి (1973–74వ సంవత్సరం) చదివారు. తర్వాత కాలంలో ఉద్యోగాలు పొందిన వారు కొందరైతే, ఇతర రంగాల్లో స్థిరపడిన వారు మరికొందరు. పిల్లలకు వివాహాలు సైతం చేశారు. మనవలు, మనవరాండ్రతో రెండవ తరాన్నీ చూస్తున్నారు. ఇంకొందరు కాలధర్మం చెందారు. రేడియోలు, ట్రంక్ బుకింగ్ కాల్స్ కాలం నుంచి ప్రస్తుతం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ యుగం వరకూ కాలచక్రంలో చోటుచేసుకున్న సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర, రాజకీయ, సాంస్కృతిక ..ఇలా మరెన్నో పరిమాణాలను ప్రత్యక్షంగా చూసిన వారే. వాటి తాలూకు జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకుని ఇప్పటి తరాలకు పంచుతున్న సీనియర్ సిటిజన్లు వారు. 49 ఏళ్ల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 60మంది వచ్చారు. తాము చదివిన తరగతి గదుల్లో కలియ తిరుగుతూ జ్ఞాపకాల పూదోటలో విహరించారు. అనంతరం ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాదు నుంచి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదో పెద్ద అచీవ్‌మెంట్

''15 రోజుల వ్యవధిలో 60 కలవడమే పెద్ద అచీవ్‌మెంట్ మాకు. అప్పట్లో 90 మంది 10వ తరగతి చదివాం. మా బ్యాచ్‌లో ఎక్కువమంది డాక్టర్లు, బ్యాంకు మేనేజర్లు అయ్యారు. మరికొందరు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. అందరూ రిటైర్డ్ అయ్యారు. రైతులుగా ఇంకొందరు ఉన్నారు. మా బ్యాచ్‌లో 12 మంది అమ్మాయిలు మాత్రమే అప్పట్లో ఉండేవారు. మా బ్యాచ్ వారు కాలక్రమంలో 23 మంది చనిపోయారు. వారిలో నలుగురు అమ్మాయిలూ ఉన్నారు. ఒకావిడ అమెరికాలో స్థిరపడి, అక్కడి పౌరసత్వం పొందింది. నేను 15 ఏళ్లు భారతీయ వైమానిక దళంలో కూడా పనిచేశాను. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా రిటైర్డ్ అయ్యాను. తిరుపతిలో స్థిరపడ్డాను. మేం చదువుకునే రోజుల్లో పదవ తరగతి పాస్ అవడమే టార్గెట్. ఆ తర్వాత ఏం చదవాలో మార్గదర్శనం చేసేవారంటూ లేరు. ఇప్పుడలా కాదు; పిల్లలు తమకంటూ గోల్ నిర్దేశించుకుని దాని కోసం కృషి చేస్తున్నారు. ఎడ్యుకేషన్ సిస్టం కూడా బాగా ఉంది. వాళ్లను సరైన దారిలో గైడ్ చేస్తున్నారు. వచ్చే ఏడాది గోల్డెన్ జూబ్లీ గ్రాండ్‌గా నిర్వహిస్తాం. ప్రతి సంవత్సరం స్కూలుకు ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకున్నాం.'' అని విశ్రాంత కస్టమ్స్ సూపరింటెండెంట్ ఇనాయతుల్లా 'సాక్షి'తో తన జ్ఞాపకాలు, అనుభవాలు పంచుకున్నారు.

2008 డీఎస్సీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

తిరుపతి ఎడ్యుకేషన్ : 2008 డీఎస్సీ ద్వారా మినిమమ్ టైం స్కేల్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతిలోని టీపీ పీఎం హైస్కూల్లో ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సులో వారు మాట్లాడారు. గతంలో వివిధ రకాల పేర్లతో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా పూర్తి స్థాయిలో రెగ్యులర్ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎంటీఎస్ పేరుతో 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులను నియమించడం సరైనది కాదని పేర్కొన్నారు. వారిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమిస్తూ సర్వీస్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జీఓ 117ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో హేతుబద్ధీకరణ ద్వారా బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. పాఠశాలల విలీనాన్ని ఆపివేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు చెంగల్రాయ మందడి, వెంకటముని, కిరణ్, నరేంద్ర, రమేష్, మునిరామిరెడ్డి, సురేష్, రవీంద్ర, కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.